క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ గ్రాంట్స్‌తో చేపట్టిన అభివృద్ధి పనులను మాజీ జెడ్పీటీసీ గీకురు రవీందర్ ఆదివారం ప్రారంభించారు. జెడ్పీపాఠశాలకు ప్రహరీ, గేటు, సీసీరోడ్డు, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు ప్రహరీ, జెండా చౌరస్తా నుంచి బొమ్మనపల్లి వరకు రోడ్డునిర్మాణానికి నిధులు మంజూరు కాగా భూమిపూజ నిర్వహించారు. గతంలో పనులకు ప్రతిపాదనలు పంపగా అనివార్య కారణాల వల్ల నిధులు మంజూరైన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో నిధులు మంజూరయ్యాయని రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి చిటుమల్ల రవీందర్, మండల ప్రధానకార్యదర్శి పూల లచ్చిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు వంగ కనుకయ్య, నాయకులు కవ్వంపల్లి సంజీవు, జిల్లేల్ల ప్రసాద్, నర్సింహారెడ్డి, బెజ్జంకి అంజయ్య, జిల్లేల్ల రమేశ్ పలువురు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



అవార్డులతో విద్యార్థులు

జమ్మికుంట: విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని, మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలు చేరాలని అవోపా కరీంనగర్ జిల్లా జోనల్ సెక్రెటరీ అయిత ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని గీతామందిర్‌లో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం మెరిట్ అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పది, ఇంటర్, ఇంజనీరింగ్, మెడికల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలోఅకినపల్లి శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వంగల శ్రీనివాస్, జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంల అధ్యక్షుడు సుదర్శన్, జోనల్ నాయకులు బచ్చు రమేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ్లె నగేష్, అర్థిక కార్యదర్శి మంచాల రాంబాబు, సీనియర్ సభ్యులు డా. ముక్కా రాజేశ్వరయ్య, రావికంటి సురేందర్, బాదం సురేస్, బచ్చు శివకుమార్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందుర్తి రెడ్డి సంఘం



రఘునాథరెడ్డిని అభినందిస్తున్న సభ్యులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గాదె రఘునాథ రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలో ఏర్పా టు చేసిన సర్వ సభ్య సమావేశంలో సభ్యులందరూ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గాదె పెద్ద రఘునాథరెడ్డి, ప్రధానకార్యదర్శిగా గునుకుల రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, గునుకుల శ్రీని వాస్‌రెడ్డి, గణపతిరెడ్డి, రాజిరెడ్డి, ఉప్పుల శ్రీనివాస్‌రెడ్డి, వెన్నం తిరుపతిరెడ్డి, కరివేద రాజిరెడ్డి ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి, మాజీ సర్పంచ్ గునుకుల అమూల్యమధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడు జగ్గారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి, కొమ్మెర భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



స్వామివారిని సన్మానిస్తున్న నాయకులు

మానకొండూర్: మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నందగిరి బలరాం, కాయితోజు పవన్ ఆధ్వర్యంలో ఆదివారం కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శ్రీపోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం పోస్టర్‌ను శ్రీకాంతేంద్ర స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మదన్మోహన్ చారి, కొత్తపల్లి బ్రహ్మాచారి, నాయకులు గుగ్గిల రమేష్, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రామోజీ రవీంద్రాచారి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కో కన్వీనర్ మియాపురం లక్ష్మణచారి, పట్టణ స్వర్ణకార సంఘం కందుకూరి శ్రీనివాస్, సత్యం, గద్దె జగదీశ్వరాచారి, శానగొండ ఆంజనేయులు, నందగిరి రమేశ్, నాగాంజనేయులు, శ్రీనివాస్, వనపర్తి వీరబ్రహ్మం తదితరులున్నారు.

ఎండలో ఎండుతూ.. వానలో తడుస్తూ..

- ఇల్లందకుంటలో ప్రయాణికుల తిప్పలు
- మండలంగా ఏర్పడి ఎనిమిదేళ్లు
- బస్టాండ్ కోసం ఎదురుచూపు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బస్సు కోసం రోడ్డు పక్కన ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది. అభివృద్ధిలో ఎలాంటి పురోగతి లేదు. ఎన్నికలకు ముందు నాయకులు ఇచ్చిన ఊకదంపుడు హామీలు ఉపన్యాసాలకే పరిమితమైంది. అపరభద్రాద్రిగా, కరీంనగర్ జిల్లాలోనే ఏకైక పెద్ద ఆలయంగా మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం పేరుగాంచింది. నిత్యం వందలాది భక్తులు దైవ దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి ఇల్లందకుంటకు వస్తుంటారు. అలాంటి మండల కేంద్రంలో బస్టాండ్ లేక భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండా, వానకు దుకాణాల మాటున ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

పేరుకే మండల కేంద్రం...

మండల కేంద్రం అయినప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో అటు పాలకులు, ఇటు అధికారులు విఫలమయ్యారు. దీంతో ప్రజల పరిస్థితి అధ్వానంగా మారింది. వివిధ పనుల నిమిత్తం మండలానికి వచ్చే ప్రజలకు బస్టాండ్ లేక నీడ కరువైంది. ప్రజలకు కనీస అవసరాలు సమకూర్చలేని దుస్థితి. మౌలిక వసతుల కల్పనలో గ్రామ పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. రాములోరి దర్శనానికి బుధ, శని, ఆదివారాల్లోత ఎక్కువ మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలకు మండలంలోని ప్రజలు నిత్యం పలు పనుల కోసం వస్తుంటారు. పరకాల, హనుమకొండ, జయశంకర్, భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల, మొగులపల్లి, భూపాలపల్లికి ఇల్లందకుంట మీదుగా పలు ప్రాంతాలకు ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కనీస మౌలిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే నాయకులు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మండలకేంద్రంలో బస్టాండ్‌తో పాటు తాగునీటి సౌకర్యం, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోవడంలేదు



గ్రామాల నుంచి మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ లేక బస్సుల కోసం ఎండలో వేచి చూడాల్సి వస్తోంది. బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు.

– చెల్పూరి రాము, ఇల్లందకుంట

ఇబ్బందులు పడుతున్నారు



బస్టాండ్ లేక పోవడడంతో రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి రాములోరి దర్శనం కోసం వచ్చే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డు పక్కన షాపుల ముందు నిలబడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించాలి.

– మాదారపు రత్నాకర్‌గౌడ్, ఇల్లందకుంట



రామడుగు: కరీంనగర్ –జగిత్యాల ప్రధాన రహదారి మండలంలోని వెదిర గ్రామ పరిధి గంగాధర మండలం హిమ్మత్‌నగర్ వెళ్లే రోడ్డు సమీపంలో ఎండిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశ్వరి, ఎంపీడీవో, రామడుగు, సెల్ నంబర్ 96403 33888

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కలిసి కట్టుగా పనిచేస్తేనే విజయం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

శంకరపట్నం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేస్తే విజయం మనదేనని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని వంకాయగూడెం గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఇరవై ఏళ్లుగా ఎమ్మెల్యే కావాలని తిరిగితే ప్రజలు కవ్వంపల్లికి అవకాశం ఇచ్చారని, ఏ గ్రామానికి అభివృద్ధి నిధులు తెచ్చారో శిలాఫలాకాలు చెప్తాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మూడో విడత బిల్లులు ఎన్నికల తర్వాత ప్రభుత్వం చెల్లించదని, ఇళ్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఆవాజ్‌యోజన పథకంలో నిర్మిస్తున్నారని, ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లని, బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఇస్తున్నామని చెప్పడమెందుకన్నారు. ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఎంపీటీసీ, సర్పంచ్‌లుగా బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.శంకరపట్నం మండలంలో నేను చేసిన అభివృద్ధి తప్ప కవ్వంపల్లి చేసిందేమీ లేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు మహిపాల్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, విండో చైర్మన్లు సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు చొడమల్ల వీరస్వామి, ఉమ్మెంతల సతీష్‌రెడ్డి, శేషాచార్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

రామడుగు: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని షానగర్ గ్రామ పరిధిలోని ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ రామడుగు మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. రామడుగు సింగిల్ విండో చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... పార్టీ గెలుపై లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీలు మార్కొండ కిష్టారెడ్డి, తవుటు మురళీ, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గంట్ల వెంకట్‌రెడ్డి, నాయకులు దాసరి రాజేందర్‌రెడ్డి, జూపాక కరుణాకర్, నాగి శేఖర్ పాల్గొన్నారు.



తిమ్మాపూర్: బోనాలతో వెళ్తున్న మహిళలు

ఘనంగా పోచమ్మ బోనాలు

తిమ్మాపూర్: మండలం కేంద్రంలో పెరిక(పురగిరి క్షత్రియ) సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనంతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. గ్రామదేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసంలో ఏటా పోచమ్మ బోనాలు నిర్వహించడం సంతోషంగా ఉందని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామ దేవతను వేడుకున్నారు. కార్యక్రమంలో పోతరాజు దేవేందర్, మాదన రాజేందర్, దుండే వీరశేఖర్, చింతం రాజు, దుండే శ్రీను, మీస విజయ్, రాజు, చింతం అనుషివ, మాదన శ్రీను, మాదన వీరయ్య, మీస శ్రీను, దుండే సతీష్, మొగిలి, రాజయ్య, లక్ష్మయ్య, శ్రీనివాస్, ఆనంద్, కొమురెల్లి, మీస అపర్ణ పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని పారువెల్లలో యాదవ సంఘం ఆధ్వర్యంలో, జంగపల్లి గ్రామంలో మాదిగల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన పోచమ్మ బోనాలతో ఊరేగింపుగా గ్రామ వీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లో ఆదివారం గ్రామస్తులు మహంకాళి బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



మానకొండూరులో...



జంగపల్లిలో ..



పారువెల్లలో..

ముద్దసాని దామోదర్‌రెడ్డికి నివాళి

శంకరపట్నం: కేశవపట్నంలో ఆదివారం మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కమలాపూర్ ఎమ్మెల్యేగా శంకరపట్నం మండలంలో చేసిన అభివృద్ధి, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మోరె ప్రభాకర్, బైరి తిరుపతి, గోపి వీరమల్లు, కదిరె కొంరయ్య, సముద్రాల సంపత్, షాబీర్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



నియామకపత్రం అందిస్తున్న సంజీవరెడ్డి

జమ్మికుంట: తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 22న నిర్వహించే చలో గన్‌పార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలో ఫోరం హుజూరాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా రాజు, జమ్మికుంట మండల ఉపాధ్యక్షుడిగా పేరవేన రమేశ్, ఇల్లందకుంట మండల సహాయ కార్యదర్శిగా గుడికందుల రాజయ్యను నియమించి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆరే రమేశ్‌రెడ్డి, పాకాల మల్లారెడ్డి, గరుకుంట్ల రాజీరు, ముత్యాల రమేశ్, పేరవేన కుమార్ యాదవ్, మిల్కూరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న స్నేహితులు

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రాములు ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. రాములుతో చదువుకున్న 1996–97 పదో తరగతి స్నేహితులు ఆదివారం రూ.61,700 అందించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అన్నప్రసాదం వితరణ

హుజూరాబాద్: పట్టణంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ చేశామని ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ కేజీబీవీ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. సీఈసీలో 29, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 18, ఆరో తరగతిలో పది సీట్లు ఖాళీలున్నాయని, ఆసక్తిగల విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు జాబ్‌మేళా

హుజూరాబాద్: యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్, హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాలకు చెందిన యువతకు 21న పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని, టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన యువత ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామంలో రైతు కానిగంటి శ్రీకాంత్‌కు చెందిన ఎద్దు ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. తన వ్యవసాయ క్షేత్రం వద్ద మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగలింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.ము ప్పైవేల నష్టం జరిగిందని విద్యుత్ అధికారులు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మహాసభలో మాట్లాడుతున్న బత్తిని రాజయ్య

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం హుజూరాబాద్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల మహాసభ నిర్వహించారు. రిటైర్డ్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని రాజయ్య మాట్లాడుతూ... రిటైర్డ్ కార్మికుల బెనిఫిట్స్, 2017 ఏరియర్స్, హయ్యర్ పెన్షన్ డబ్బులు కట్టిన అందరికి పెన్షన్ డబ్బులు అందేలా చూడాలన్నారు. ఏరియర్స్ విషయంలో ఆర్టీసీ పీఎఫ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, అయినప్పటికీ పరిష్కారం కావడం లేదని, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, లేదంటే పీఎఫ్ ఆఫీస్, ఎండీ ఆఫీస్, బస్సు భవన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. అనంతరం డివిజన్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా వొడితల ప్రణవ్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆర్.చారి, జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, వేల్పుల రత్నం, రాష్ట్ర కార్యదర్శి పంజాల వెంకటయ్య, రాష్ట్ర నాయకులు నాగరాజు, కె.నారాయణ, వేల్పుల ప్రభాకర్, మార్త రవీందర్, నర్సయ్య, లక్ష్మణరావు, రెడ్డి సంపత్‌కుమార్, రంగు పండరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ చెస్ దినోత్సవం



చెస్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో గల జీనియస్ చెస్ అకాడమీలో ఆదివారం అంతర్జాతీయ చదరంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్రీడాకారులకు చెస్ పోటీలతో పాటు చెస్‌పై వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు ప్రముఖ మానసిక వైద్యనిపుణులు విజయప్రసాద్, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్, కోచ్ కంకటి అనూప్‌కుమార్ బహుమతులు అందజేశారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవి, తెలుగు బోధకులు జి.శ్రీనివాస్ బాలకుటీర్ నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, కోచ్‌లు, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన ఆటోడ్రైవర్లు



శంకరపట్నం: కేశవపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో ని గుంతలను ఆదివారం ఆటోడ్రైవర్లు పూడ్చారు. చౌరస్తా వద్ద రోడ్డు గుంతలమయంకావడంతో ఆటోలు మరమ్మతుకు గురవుతున్నాయని, ఆటో యూనియన్ సభ్యులు సొంత డబ్బులతో గుంతలను కంకర, సిమెంట్‌తో పూడ్చివేశారు.

డబుల్ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం



గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణం ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. గునుకులకొండాపూర్ నుంచి జంగపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పనులు చేపట్టారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్డును ఆనుకొని ఉన్న వ్యవసాయ బావులువద్ద కంకర కొట్టుకుపోయింది. దీంతో గుండ్లపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి బావి వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. అలాగే ఇటీవల గునుకులకొండాపూర్‌లో వర్షానికి బావి పక్కన నుంచే వెళ్లు రోడ్డు కుంగి పెద్ద గొయ్యి ఏర్పడింది. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపంతో పాటు నిబంధనలు పాటించకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు పనులపై దృష్టి సారించాలని, రోడ్డు పక్కన బావులను పరిహారం అందించి పూర్తిగా తొలగించడం లేదా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.